
సంఘమిత్ర ఆస్పత్రిలో జిల్లా జడ్జిని సత్కరిస్తున్న దృశ్యం


ఒంగోలు జీజీహెచ్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం


ఒంగోలులోని హాస్టల్లో విద్యార్థినులతో డైరెక్టర్ పద్మావతి, సభ్యులు


ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న అధికారులు

మహిళలకు సీఎం అత్యంత ప్రాధాన్యత

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ డైరెక్టర్ బత్తుల పద్మావతి ● ఘనంగా మహిళా దినోత్సవం

ఒంగోలు సబర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ డైరెక్టర్ బత్తుల పద్మావతి అన్నారు. నగరంలోని రామ్‌నగర్‌లో ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే బాలికలు స్వతంత్రంగా ఎదగగలరని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. అన్ని సంక్షేమ పథకాలను మహిళలకే ఇచ్చి ఆదరిస్తున్నారని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా విద్యపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని వివరించారు. బాల్య వివాహాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఒకవేళ ఇళ్లలో తల్లిదండ్రులు బాల్య వివాహ ప్రస్తావన తెస్తే మహిళా కమిషన్‌కు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ వంశీలత, హెచ్‌డబ్ల్యూ ఎం.అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

పలు సంస్థల ఆధ్వర్యంలో...

ఒంగోలు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక విశ్వసేవిక ట్రస్టులోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. వడ్డెర సంఘ జిల్లా అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, కుంచాల కోటేశ్వరమ్మ, తన్నీరు రమణయ్య, తన్నీరు నారాయణ, తన్నీరు వీరసాయి, పల్లపు రమాదేవి పాల్గొన్నారు. స్థానిక శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సత్కరించారు. డాక్టర్ వైష్ణవి (రిమ్స్), డాక్టర్ మాధురి (రామచంద్రమిషన్), పర్చూరి లక్ష్మీకుమారి (అడ్వకేట్), శిద్దా జయశ్రీ (పీఎస్ఎస్ఎం), బీకే మాధురి సిస్టర్(బ్రహ్మకుమారీస్), మువ్వా రాధిక (పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్), యూవీఎస్ లక్ష్మీదేవి (డ్రీమ్స్ కరస్పాండెంట్), రామలక్ష్మి (గాయత్రీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ అధినేత), భాగ్యలక్ష్మి (మధునర్సింగ్ కాలేజీ)లను సత్కరించారు. రిటైర్డ్ ఎస్పీ రాజశిఖామణి, డాక్టర్ కృష్ణన్‌బాబు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ప్రతినిధులు కసిబిసి నాగేశ్వరరావు, సూరే ఏడుకొండలు, సోమినేని సురేష్, జేసీ గణేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో మహిళా సాధికారత సెల్, ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. శాస్త్రీయ, విద్యాబోధన, పరిశోధన, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హిమబిందు, ప్రిన్సిపాల్ డాక్టర్ దక్షిణామూర్తి, కమిటీ సభ్యులు పాల్గొని పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్టీసీ ఆర్ఎం బి.సుధాకరరావు అధ్యక్షతన ఆర్టీసీలో అత్యుత్తమ సేవలందిస్తున్న ఐదుగురు మహిళలను సత్కరించారు. ఒంగోలు డిపో డీఎస్ కుమారి, పొదిలి డిపో నుంచి వి.జ్యోతి, మార్కాపురం-టి.పద్మజ, గిద్దలూరు-ఎస్ఎస్ కుమారి, కనిగిరి డిపో-కేసీహెచ్ లతలను ఘనంగా సత్కరించారు. ఒక్కొక్కరికి రూ.500 నగదు, ప్రశంసపత్రం అందించారు. నల్లూరి నర్సింగ్‌హోం వైద్యులు డాక్టర్ నల్లూరి అరుణ, డాక్టర్ స్నేహప్రియ, ఏఎస్పై గౌతమి, ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని మహిళా కండక్టర్లు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పితృస్వామ్యానికి వ్యతిరేకంగా స్త్రీలు పోరాటం చేయాలి...

ఒంగోలు టౌన్: స్త్రీ పురుష అసమానత్వాన్ని పటిష్టం చేసే బీజేపీ బ్రాహ్మణీయ పితృస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాటాలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని నారాయణ స్వామి స్మారక భవన్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. తొలుత స్థానిక రిమ్స్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా నాయకురాలు ఎస్.భారతి అధ్యక్షత వహించిన సదస్సులో జిల్లా కార్యదర్శి వి.మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో కవితల పోటీలు...

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హౌసింగ్ బోర్డులోని నరసం కార్యాలయంలో మహిళలకు కవితల పోటీలు నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన 51 మంది కవయిత్రులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి డాక్టర్ కర్నాటి చంద్రమౌళి (కర్నూలు), ద్వితీయ బహుమతి నామని సుజనాదేవి (వరంగల్), తృతీయ బహుమతి నల్లపనేని విజయలక్ష్మి(గుంటూరు) గెలుచుకున్నట్లు నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ప్రకటించారు. జూమ్ సమావేశంలో విజేతలకు అభినందనలు తెలపారు. కార్యక్రమంలో మున్నంగి రాహేలు, సింహాద్రి జ్యోతిర్మయి, మారేపల్లి సూర్యకుమారి, నరసమ్మ, మనోరంజని, కృష్ణవేణి, కృపావరం తదితరులు పాల్గొన్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో కవి సమ్మేళనం జరిగింది.

మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాడదాం...

మహిళలపై హింసను పెంచుతూ, కుటుంబాలను నాశనం చేస్తూ, సమాజాన్ని నేరగ్రస్తం చేస్తున్న మద్యంపై మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాడదామని బొమ్మరిల్లు వ్యవస్థాపకురాలు పి.రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ఈమనిపాలెంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. ఏపీటీఎఫ్ జిల్లా నాయకురాళ్లు తిరుమల, పి.శాంతకుమారి, ఎస్.లలితకుమారి, సుజాత, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : డీఆర్‌డీఏ పీడీ బాబూరావు

ఒంగోలు రూరల్: అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నప్పుడే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని డీఆర్‌డీఏ పీడీ పి.బాబూరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఏపీఎం గోపీనాథ్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు టగ్ ఆఫ్ వార్, లెమన్ స్పూన్, రన్నింగ్ తదితర అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించి సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలను ఎంపిక చేశారు. అనంతరం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి.సంధ్యారాణి అధ్యక్షతన ఒంగోలు ఏపీఎం గోపీనాథ్ కన్వీనర్‌గా వ్యవహరించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ టి.రవికుమార్ పాల్గొని మాట్లాడారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను పీడీ సన్మానించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల, ఎం.సంధ్యారాణి, సీసీ చెంచులక్ష్మి, అకౌంటెంట్ ఎస్.సామ్రాజ్యం, వీవోఏ అంజమ్మలను సన్మానించారు. అవార్డు పొందిన వారిలో పద్మ, కృష్ణవేణి, డి.అనూరాధ, టి.ప్రమీల, పి.కృష్ణవేణి ఉండగా, ఆటల పోటీల్లో గెలుపొందిన వారిలో రోజా, లావణ్య, పద్మ ఉన్నారు.

మహిళలు ఉన్నత స్థానాలకు ఎదగాలి...

మద్దిపాడు: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని మహిళలు ఉన్నత స్థానాలకు ఎదగాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పీహెచ్‌సీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా చందు అకాడమీ, ఒంగోలుకు చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం ఆస్పత్రి డాక్టర్ మానస దేవరకొండ సుబ్బయ్య మెమోరియల్ ట్రస్ట్ తరఫున ఇద్దరు ఆశావర్కర్లకు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో గెలిచిన మహిళలకు ఎంపీపీతో పాటు వైస్ ఎంపీపీ మోరబోయిన విజయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఆస్పత్రి సూపర్‌వైజర్ బాలకోటయ్య, సీహెచ్‌వో లలితమ్మ, వెంకారెడ్డి పీహెచ్ఎన్ రజితకుమారి, సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, పద్మ పద్మలత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవం...

చీమకుర్తి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం స్థానిక మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మెప్మా కార్యాలయంలో స్థానిక వీవోలు, సభ్యులను మెప్మా పీడీ రవికుమార్, అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో ప్రశంసపత్రాలను అందించి సత్కరించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్థానిక మహిళా టీచర్లు, బాలికల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ ప్రాధాన్యతను తెలియజేశారు. చీమకుర్తిలోని భాష్యం పబ్లిక్ స్కూల్లో హెచ్ఎం బీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాతృమూర్తిని గౌరవించే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో తల్లులకు పాదాభివందనం చేయించారు.


నరసం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం...


ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాబూరావు


ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ఏపీఎం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు


స్త్రీ విముక్తి సంఘటన సభలో మాట్లాడుతున్న జిల్లా నాయకురాలు


క్విస్ కాలేజీలో మహిళలు, విద్యార్థినులకు సత్కారం


మద్దిపాడు: మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న వైద్య శాఖ సిబ్బంది


మద్దిపాడు: ఎంపీపీ అరుణ, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, డాక్టర్లను సన్మానిస్తున్న చిన్నారులు


చీమకుర్తి జెడ్పీ బాలికల హైస్కూల్లో కేక్ కట్ చేస్తున్న టీచర్, బాలికలు


లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం


విశ్వసేవిక ఆశ్రమంలో చీరలు పంపిణీ చేస్తున్న వడియరాజుల సంఘం నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు


చీమకుర్తిలో మెప్మా సభ్యులను సత్కరిస్తున్న పీడీ రవికుమార్


మద్దిపాడు: పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

పలు ఆస్పత్రుల్లో మహిళా దినోత్సవం

ఒంగోలు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రితో పాటు పలు ఆస్పత్రుల్లో ఘనంగా నిర్వహించారు. మెరుగైన సేవలందించిన మహిళా డాక్టర్లు, ఇతర సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. స్థానిక నల్లూరి నర్సింగ్ హోమ్‌లో ఉత్తమ సేవలందించిన మహిళలకు సత్కారం చేసి బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీవోవో సాతులూరి నరసింహమూర్తి, హాస్పిటల్ ఎండీ డాక్టర్ నల్లూరి నితిన్, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు. జీజీహెచ్‌లో నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం మెరుగైన సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేశారు. నర్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉదయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ వందనాదేవి, బత్తుల విజయకుమార్, హనుమంతు, రమనానాయక్ పాల్గొన్నారు. సంఘమిత్ర హాస్పిటల్లో జిల్లా జడ్జి ఏ భారతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆమెను ఘనంగా సత్కరించారు. సీవోవో హరికుమార్‌రెడ్డి పాల్గొని హాస్పిటల్లో ఉత్తమ సేవలు కనబరిచిన మహిళా ఉద్యోగులను సన్మానించి అభినందించారు. కిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన సేవలందించిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, సీవోవో అంకిరెడ్డి, డాక్టర్లు కల్పన, సుజని, విజయలక్ష్మి, హైందవి, సింధూర, శైలజ, అనూష, అరుణప్రియ, రజని, సిబ్బంది పాల్గొన్నారు.


సత్కారం అందుకుంటున్న శిద్దా లక్ష్మీపద్మావతి

శిద్దా లక్ష్మీపద్మావతికి ఘన సత్కారం...

ఒంగోలు: శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి, ఆర్యవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు శిద్దా లక్ష్మీపద్మావతిని ఘనంగా సత్కరించారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసాలి గ్రామ మఠం ట్రస్టు వ్యవస్థాపకులు ప్రజ్ఞానంద సరస్వతితో కలిసి జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆహూతులు, భక్తుల సమక్షంలో సామూహిక మణిద్వీప వర్ణణ గళార్చన కార్యక్రమం నిర్వమించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి నిర్వహించిన సత్కారంలో భాగంగా శిద్దా లక్ష్మీపద్మావతి సత్కారం అందుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ ఎన్.అనంతలక్ష్మి, ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు కొండవీటి జ్యోతిర్మయి పాల్గొని అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించగా ట్రస్టు కార్యదర్శి ఉప్పల నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.


సత్కారం అందుకుంటున్న కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ

కార్పొరేటర్ లక్ష్మీకోటేశ్వరమ్మకు సత్కారం...

గ్రో స్వచ్ఛంద సంస్థ వారు ఒంగోలు 38వ డివిజన్ కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. సంస్థ మేనేజర్ ఎస్‌కే పీరుబాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.



కిమ్స్ ఆస్పత్రిలో మహిళా దినోత్సవం...


నల్లూరి నర్సింగ్ హోమ్‌లో మహిళా దినోత్సవం...


చీమకుర్తిలోని భాష్యం స్కూల్లో తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

చీమకుర్తి/ఒంగోలు రూరల్/కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పేర్నమిట్టలో ఆ పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఒంగోలు రూరల్‌లో మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య, కొత్తపట్నం మండలంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే టీజేఆర్‌ను కలిసిన యానాదిశెట్టి


ఎమ్మెల్యే టీజేఆర్‌తో యానాదిశెట్టి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితుడైన చీమకుర్తికి చెందిన సోమా యానాదిశెట్టి ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఒంగోలులో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. యానాదిశెట్టిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, పేరం శ్రీనివాసరావు, చేనేత సొసైటీ ప్రెసిడెంట్ అవ్వారు ఆదినారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను సత్కరించిన జెడ్పీటీసీ


జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు బుధవారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాలడుగు సుబ్బారావు, పేరం శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డీపీఎం సనితకు పురస్కారం


ప్రశంసపత్రం అందుకుంటున్న డీపీఎం సనిత

ఒంగోలు సబర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన డీపీఎం పీ సనితకు ప్రశంసపత్రాన్ని అందజేశారు. జిల్లాలోని డీఆర్‌డీఏలో పనిచేస్తూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఉత్తమ సేవలు అందించినందుకుగానూ రాష్ట్ర సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెర్ప్, జిల్లాకు చెందిన డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

ఒంగోలు సబర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీఎస్ఆర్ శర్మ కళాశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరవది రాఘవరావు ఆయన సతీమణి సంధ్య రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.